## క్లుప్తంగా

### పల్లె దవాఖానా మంజూరు చేయాలని మంత్రికి వినతి


మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**దేవరకొండ :** దేవరకొండ మండల పరిధిలోని తాటికోల్ గ్రామానికి పల్లె దవాఖానా మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. స్పందించిన మంత్రి గ్రామానికి పల్లె దవాఖానా మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఐటీ టవర్‌లో యువతకు ప్రాధాన్యం కల్పించాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్

**హాలియా :** నలగొండ జిల్లాలకేంద్రంలో త్వరలో ప్రారంభించనున్న ఐటీ టవర్‌లో ఇంజనీరింగ్ చేసిన స్థానిక యువతకు ప్రాధాన్యం కల్పించాలని శుక్రవారం శాసనసభలో నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ ప్రస్తావించారు. దీంతో ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశానికి సంబంధిత ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాలోని స్థానిక యువతకే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### గ్రామపంచాయతీ కార్మికుడి మృతి

**చింతపల్లి :** మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ గ్రామపంచాయతీ కార్మికుడు గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆలంపల్లి బాజారు(45) గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు.

### కేజీబీవీ భవన నిర్మాణ పనుల పరిశీలన

**అడవిదేవులపల్లి :** మండల కేంద్రంలో నూతన నిర్మిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, ఎంఈఓ ఎం. బాలాజీనాయక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు దాదాపు పూర్తికావొచ్చయని, 15రోజుల్లో నూతన భవనం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అత్యాధునిక వసతులతో నిర్మించినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరించిన స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకు ఎంపీపీ బాలాజీనాయక్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, ప్రత్యేక అధికారిని నాగలక్ష్మి, జిల్లా రిసోర్స్ పర్సన్ గ్రూప్ సభ్యులు బాలు తదితరులున్నారు.

### కనీస టైం పే స్కేల్ అమలు చేయాలని వినతి

**మిర్యాలగూడ :** కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ ప్రభుత్వం మినిమం టైం పే స్కేలు అమలు చేయాలని శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎం.అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమగ్ర శిక్షా సిబ్బంది అందరికి మినిమం టైం పే స్కేలును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదిరెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ, పాండు, గాంధీ, పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పీఈటీలు

**నాగార్జునసాగర్ :** రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి సురేశ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్ తెలిపారు. ఇటీవల నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో 400మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో ఈ నెల 7న హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో పాల్గొననున్నాడు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ నర్సింహ, పాఠశాల సూపరింటెండెంట్ నరేందర్‌రెడ్డిలు విద్యార్థిని అభినందించారు.

# తాగునీటికి తప్పని తిప్పలు

- సరిగా సరఫరాకాని భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు


డిండిలో నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

**డిండి :** వర్షాకాలంలోనూ మండలంలోని ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రజల దాహార్తిని తీర్చడం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం ప్రవేశ పెట్టి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చింది. అయినా తాగునీరు మాత్రం సరిగా సరఫరా కావడం లేదు. దీంతో మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని జనాభాను బట్టి మిషన్ భగీరథ నీరు వాటర్ ట్యాంక్‌ల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా తమకేమీ పట్టనట్టు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకెళ్లినా..**

మండలంలోని డిండి, కందుకూర్, వీరబోయనపల్లి, ఖానాపూర్, రుద్రాయగుడెం, బొల్లనపల్లి, దేవునిగుడితండాల్లో తాగునీటి సమస్య జఠిలంగా మారింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తాగునీటి సమస్యను ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైన చోట వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసిన జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మా గ్రామంలో మిషన్ భగీరథ నీరు ప్రతిరోజు సరఫరా కావడంలేదు. దీంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తప్పని పరిస్థితుల్లో ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటిని అందించాలి.

– కవిత గృహిణి, డిండి

### పట్టించుకోవడం లేదు



డిండి పట్టణంలో వారంలో మూడు రోజుల మాత్రమే మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

– మేకల సాయమ్మ, సర్పంచ్ డిండి

### నూతన ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నాం



డిండి మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న మాటా వాస్తవమే. తాగు నీటి సమస్య ఉన్న గ్రామాల్లో జనాభా సంఖ్యకనుగుణంగా తాగునీటిని అందించేందుకు అవసరమైన చోట నూతనంగా వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

– నరేష్, ఏఈ మిషన్ భగీరథ

## వీధి వ్యాపారులు బీమా చేయించుకోవాలి


బీమా పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మ

**హాలియా :** పీఎం స్వానిధి సమృద్ధి పథకంలో భాగంగా వీధి వ్యాపారులు తప్పని సరిగా బీమా చేయించుకోవాలని హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా పురపాలిక సంఘం కార్యాలయంలో వీధి వ్యాపారులకు నిర్వహించిన బీమా పథకం అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. హాలియా మున్సిపల్ పరిధిలో 624 మంది వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందేసినట్లు వారు తెలిపారు. వీధి వ్యాపారులందరూ పీఎం స్వానిధి సమృద్ధి పథకంలో భాగంగా బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం చిరు వ్యాపారులకు బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, టీఎంసీ వసంత్‌కుమార్, టీ.వీ.సీ మెంబర్ షేక్ అన్వరుద్దీన్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఆర్‌పీలు, పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న బాలునాయక్

**దేవరకొండ :** రాబోయే సాధారణ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఖాలీద్‌అహ్మద్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఈ సమావేశంలో యువజన ఖాలీద్‌అహ్మద్, నాయకులు హరికృష్ణ, రాజారమేష్‌యాదవ్, నర్సింహారెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు.

## డబ్బా పాలు వద్దు..తల్లిపాలే ముద్దు


మిర్యాలగూడ టౌన్: అశోక్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు

**మిర్యాలగూడ టౌన్ :** డబ్బా పాలు వద్దు..తల్లిపాలే ముద్దు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారీ, అంగన్‌వాడీ టీచర్లు కె. జ్యోతి, షబానాబేగం అన్నారు. శుక్రవారం ఎస్ఎస్‌పీ సెక్టార్ పరిధిలోని అశోక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సావాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోనే ముర్రు పాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరు నెలల తరువాత పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

**తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి**

**త్రిపురారం :** గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఫరిధా బేగం అన్నారు. శుక్రవారం దామరచర్ల ప్రాజెక్ట్ త్రిపురారం క్లస్టర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలు వివిధ గ్రామాల నుంచి ఆస్పత్రికి వచ్చిన వారికి అంగన్ వాడీ సిబ్బంది పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ తావూ నాయక్, బషీర్, హెల్త్ సూపర్ వైజర్ లలిత కుమారి, అంగన్ వాడీ టీచర్లు శైలజ, మంగమ్మ, ఏలేశ్వరి, సరిత ఆశవర్కర్లు సలీమా, అశ్విని, సైదమ్మ, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి**

**కొండమల్లేపల్లి :** అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రానికి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ భోజనం, కోడిగుడ్లు, 200గ్రాముల పాలు, ఆకు కూరలతో కూడిన ఆహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాణిక్యమ్మ, వెంకటమ్మ, ఆశా వర్కర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

**పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టాలి**

**నిడమనూరు :** పుట్టిన బిడ్డకు అర్ధగంటలోగా తల్లి ముర్రుపాలు పట్టాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరి, సైదా బేగం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పార్వతీపురం, ఊట్కూర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సైదాబేగం, సర్పంచ్ విజయ్, అంగన్ వాడీ టీచర్లు అంకతి రుక్మిణి, అన్నపూర్ణ, అనూరాధ, ఏఎన్ఎం జయకుమారి, గర్భిణులు, బాలింతలు అరుణ, అనూష, చాందిని, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలు పెంపొందించాలి


అడవిదేవుపల్లి : మాట్లాడుతున్న ఎంఈఓ


పెద్దవూర : మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

**అడవిదేవులపల్లి :** ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా విద్యాశాఖ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుకు ఇద్దరు మండలానికి ఆరుగురు ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లు కేటాయించం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల్ నోడల్ అధికారి అబ్బాస్ అలీ, అబ్జర్వర్ సైదిరెడ్డి, ట్రెనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ వెంకట్రామ్, ఆర్పీలు శ్యామ్‌కుమార్, వీరేశ్‌లతో పాటు ఉపాధ్యాయులు తదితరులున్నారు.

**పెద్దవూర :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలిమెట్టు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులు శుక్రవారం గణితంపై నిర్వహించారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలను నేర్పించాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ అధికారి శేషు, పాల్గొన్నారు.

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** ప్రాథమిక స్థాయిలో విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మండల విద్యాశాఖ అధికారి తరి రాము అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం మూడో రోజు శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ తరి రాము సందర్శించి, పలు సూచనలు చూశారు. విద్యార్థులకు కనీస అభ్యాసన సమర్థ్యాలు పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులైందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదా నాయక్, వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**గుర్రంపోడు :** విద్యార్థుల్లో పుస్తక పఠన సామర్థ్యాలు పెంచేలా పాఠశాల గ్రంథాలయ పుస్తక పఠనకు ప్రత్యేకంగా పీరియడ్‌ను కేటాయించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆర్. రామచందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి తొలిమెట్టు శిక్షణా తరగతులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయులకు గ్రంథాలయ పుస్తకాల్లోని కథల పుస్తకాలు చదివించడం , సొంతంగా కథలు చెప్పడం ద్వారా వారిలో పఠన ఆసక్తి పెరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సిహెచ్ వెంకట్రామ్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనయాచారి, స్టేట్ రిసోర్సు పర్సన్‌లు నర్సింహ్మారావు, శేషు, మండల రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

**దేవరకొండ :** 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరుగా నమోదైన వారు ఓటు హక్కును వినయోగించుకోవాలని ఆయన సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అన్నారు. ఓటరు జాబితాలో సవరణలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ(205),బచ్చాపురంలో(207) రెండు పోలింగ్ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలకు మార్చినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఆర్డీఓ కార్యాలయంలో ప్రతి వారం సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డీటీ ముబీన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**అడవిదేవులపల్లి :** మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీఓ చెన్నయ్య పరిశీలించారు. అదే విధంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న నడిగడ్డ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బంగారుకుంట తండాలోని గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ ఠాకూర్ రామకృష్ణ, అంగన్‌వాడీ టీచరు పద్మ ఉన్నారు.

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** మండలంలోని కొంపల్లి ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ పి. యాదగిరి పరిశీలించి మాట్లాడారు. 18ఏళ్లు నిండి ఉన్న యువతి, యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట బీఎల్‌వో, వీఆర్ఏ బాలాజీ ఉన్నారు.

## మొక్కల పంపిణీ


కొరివేనిగూడెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు

**హాలియా :** అనుముల మండలంలోని కొత్రివేనిగూడెం, అల్వాల గ్రామాల్లో శుక్రవారం బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు పలువురికి పండ్ల మొక్కలు, జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలనే సంకల్పంతో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటడం వల్ల రాబోయే తరాలకు, ఐశ్వరాల కన్నా స్వచ్ఛమైన ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని వారు పేర్కొన్నారు. ఇంటింటా తిరుగుతూ పండ్ల మొక్కలు, జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్రివేనిగూడెం గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


## అధికారుల సూచనల మేరకే పాఠశాల భవనం కూల్చాం

**మిర్యాలగూడ :** మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల స్థానంలో ఆస్పత్రిని నిర్మించాలని అధికారులు సూచించడంతో తాము భవన కూల్చివేత పనులు ప్రారంభించామని ఆ గ్రామ సర్పంచ్ చౌగాని భిక్షం అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో వైద్యం లభిస్తుందనే మంచి ఉద్దేశ్యంతో తాము నిర్మాణ పనులు చేపట్టాలనుకున్నామన్నారు. ఇందులో ఎలాంటి రాజకీ య దురుద్దేశం లేదని కేవలం గ్రామ అభివృద్ధిలో భాగంగానే నిర్మాణం తలపెట్టామన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో తాత్కాలికంగా ఈ పాఠశాలల్లో తరగతులను అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులకు తాత్కాలికమైన వసతిని సైతం చూశామన్నారు. ఈ విషయం తెలియ మాజీ సర్పంచ నరేందర్‌గౌడ్ భవన కూల్చివేతను అడ్డుకోవడంతోపాటు దాని సమీపంలో ఉన్న తమ ఇంటిపైకి వచ్చి తన భార్యను దుర్భాషలాడుతూ అసభ్యంగా మాట్లాడారన్నారు. వెంటనే తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అదే సమయంలో నరేందర్ కూడా పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని ఆయన బందారం బయట పడుతుందని పోలీసులకు భయపడి నరేందర్ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, చౌగాని సతీష్, సీపీఎం నాయకులు సీతారాములు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల ఏర్పాటులో ఎమ్మెల్యే వైఖరిపై నిరసన

**పెద్దవూర :** గ్రామ పంచాయతీల ఏర్పాటుపై అభ్యంతరాలు చెబుతారంటూ తనను కలవడానికి వచ్చిన ఆయా గ్రామాల నాయకుల మీద ఎమ్మెల్యే భగత్ అసహనం వ్యక్తం చేశాడని, అందుకు నిరసనగా శుక్రవారం నాగార్జునసాగర్-జడ్చర్ల రహదారిపై ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని నిమ్మనాయక్ తండా, పూల్యతండా, మల్లెవానికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలను ఆ గ్రామాల నుంచి తొలగించి నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్న విషయాన్ని తెలుసుకొని ఆ తండాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే భగత్ ఇంటికి వెళ్లి విడదీస్తే తమకు నష్టం జరుగుతుందని తెలిపారు. దీంతో ఆయన వారిపై పైవిధంగా విరిచుకుపడ్డాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమావత్ రాములు నాయక్, సామ్య, ఉన్నారు.

## అధికార పార్టీ అక్రమ కేసులపై పోరాడుతాం


నరేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీఎల్ఆర్

**మిర్యాలగూడ :** అధికార పార్టీ చేస్తున్న ఆగడాలపై కాంగ్రెస్ పార్టీ వెనుకడుగు వేసేది లేదని, వారు పెట్టించే అక్రమ కేసులపై ధైర్యంగా పోరాడి ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. శుక్రవారం తక్కెళ్ల పాడు గ్రామ మాజీ సర్పంచ్ గుండు నరేందర్ గౌడ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం కూల్చి అదే స్థలంలో వైద్యారోగ్య కేంద్రాన్ని నిర్మించాలనుకుంటున్న అధికార పార్టీ సర్పంచ్ చౌగాని భిక్షంను నరేందర్‌గౌడ్ ప్రశ్నించగా దాడి చేయడమే కాకుండా అతడిపై పోలీసు స్టేషన్ అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు బీఎల్ఆర్ తెలిపారు. సుమారు 70 మంది పిల్లలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రానికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా నిర్ధాక్షిణ్యంగా కూల్చాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆస్పత్రి నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన స్థలాన్ని వదిలిపెట్టి మంచి నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికార పార్టీ అక్రమాలకు ప్రజలు భరించే ఓపిక పోయిందని రానున్న ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, సిద్ధునాయక్, వెంకన్న, చిలుకూరి బాలు తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయాలి

**మిర్యాలగూడ అర్బన్ :** ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 9న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట, 10న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిర్వహించే మహాదర్నాకు కార్మికులు, కర్షకులు భారీగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.సయ్యద్ లింగానాయక్, వెంకన్న, కాజా, సత్తార్, రఫీ, సయ్యద్, చక్రపాణి, సూర్య పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి :** గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరబాద్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 5న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గనిమళ్ల శ్రీరాములు కోరారు. ఈ కార్యక్రమంలో దేవకుమార్, సంజీవ్‌కుమార్, నల్లా నర్సింహా, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**మండల కార్యవర్గం ఎన్నిక**

**మిర్యాలగూడ :** సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం దామరచర్ల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బంటు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ధరావత్ పాండునాయక్, మహిళ అధ్యక్షురాలిగా జె.నవనీత, ఉపాధ్యక్షురాలిగా లావూరి శారదలతోపాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రవి, డేవిడ్, వెంకటేశ్వర్లు, విజయగాంధీ, లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ, సురేక, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

**ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**

**కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాయి ప్రకర్ష జూనియర్ కాలేజీలో శుక్రవారం ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంకూరి నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, ప్రసాద్, రాకేశ్ పాల్గొన్నారు.

**నిందితులపై చర్యలు తీసుకోవాలి**

**మాడుగులపల్లి :** తమ పొలంలో సాగు చేసిన పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన రైతు కొడిదల యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 484లో తమకున్న రెండెకరాల 30 గుంటల భూమిలో సాగు చేసిన పెసర చేనుపై ఈ నెల 2న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంట నాశ నమయ్యే మందును పిచికారీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని కోరారు.

**ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి**

**హాలియా :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లోకి డీఈఓ అనుమతి లేకుండా ఇతరులను లోపలికి రావడానికి అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనా ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్, రమేష్, సాయి, చందు, సంపత్, మోహన్ ఉన్నారు.

**ఉచిత వైద్యశిబిరం**

**మాడుగులపల్లి :** మండలంలోని ఇందుగుల గ్రామంలో హెల్త్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు కలెక్టర్ ఆదేశాల మేరకు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు రక్త, మూత్ర, షుగర్, థైరాయిడ్ హెచ్‌బీ1సీ, వినికిడి, కంటి, ఈసీజీ, హెచ్ఐవీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరానికి 150 మందికిపైగా హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర కన్నయ్య, వైద్యాధికారి మహేష్, నవీన్, చంద్రకళ, నరేందర్, పాల్గొన్నారు.

**దళిత బంధు అందించాలని వినతి**

**మిర్యాలగూడ టౌన్ :** అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందే విధంగా చూడాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఆ పార్టీ దళిత మోర్చా ఆధ్వర్యంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరంగి శ్యాం, జిల్లా కార్యదర్శి మంథ శివ మంద రాజేష్, తదితరులున్నారు.

**ఏఎన్‌ఎంల అరెస్ట్**

**కొండమల్లేపల్లి:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఎన్ఎం సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లకుండా కొండమల్లేపల్లి మండలానికి చెందిన రెండో ఏఎన్‌ఎంలను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఎస్.సునిత, జె.ధనలక్ష్మి, కె.తిరుపతమ్మ, బ్లెసి, ఇఫాత్ తదితరులున్నారు.

## 6న ఏఐఎస్ఎఫ్ ఆత్మీయ సమ్మేళనం

**పెద్దవూర :** ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆత్మీయ సమ్మేళాన్ని ఈనెల 6న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సమావేశ ఆహ్వాన కమిటీ చైర్మన్ పాదిల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు సీతారాం, రాజేష్, మల్లిఖార్జున్, శ్రవణ్, గోపి, రతన్ పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి కేసీఆర్ ఫౌండేషన్ విరాళం

**గుర్రంపోడు :** మండంలలోని చేపూరు గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం రూ.50,116 లవిరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చేపూరు గ్రామ సర్పంచ్ కట్టెబోయిన విజయ్, వార్డు సభ్యుడు మారపాక మహేందర్, కొమ్ము వెంకన్న పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

**మాడుగులపల్లి:** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మిర్యాలగూడ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు మాడుగులపల్లి ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పోలీసు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.